సాక్షి
రంగారెడ్డి
సోమవారం ׀ 6 ׀ జనవరి ׀ 2025



పొగమంచు.. గమనించు

పొగమంచు పంజా విసురుతోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

8లో ▸



కరాటేతో మానసికోల్లాసం

విద్యార్థుల్లో యుద్ధవిద్యలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని సినీనటుడు సుమన్ పేర్కొన్నారు.

8లో ▸



వేతనాలు పెంచాలి

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్ డిమాండ్ చేశారు.

8లో ▸

సహకారం.. ప్రక్షాళన పర్వం!

అనర్హుల ఏరివేత ప్రక్రియ ప్రారంభం

- ఈకేవైసీతో సభ్యుల పేర్లు అనుసంధానం
- ఫిబ్రవరితో ముగియనున్న పాలక మండళ్ల గడువు
- పారదర్శకంగా పరపతి సంఘాల ఎన్నికల నిర్వహణ
- రైతులకు మరింతగా పీఏసీఎస్‌ల సేవలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో సభ్యత్వాల ప్రక్షాళన మొదలైంది. ఇప్పటికే భూములు అమ్ముకున్న వాళ్లతో పాటు చనిపోయిన వాళ్లు కూడా సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరి సభ్యత్వాన్ని తొలగించే ప్రక్రియకు జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు శ్రీకారం చుట్టాయి. ఇందు కోసం సొసైటీల్లోని సభ్యుల ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించాయి. బ్యాంకు అకౌంట్లకే కాకుండా సంఘాల్లోని సభ్యత్వానికి ఈకేవైసీ అనుసంధానించడం ద్వారా పరపతి సంఘాల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించొచ్చని భావిస్తున్నారు. అంతేకాదు కేంద్రం ఆదేశాల మేరకు ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్‌లను పునర్విభజించి కొత్తగా మరికొన్ని ఏర్పాటు చేసి గ్రామీణ రైతులకు సహకార సేవలను మరింత చేరువ చేయాలని యోచిస్తున్నారు.

లొసుగులకు ఈకేవైసీతో చెక్

జిల్లా సహకార సంఘం పాలక మండలితో పాటు మండల సహకార సంఘం పాలక మండళ్ల గడువు ఫిబ్రవరితో ముగియనుంది. డీసీసీబీలో చైర్మన్, వైస్ చైర్మన్ సహా 21 మంది డైరెక్టర్లు ఎన్నుకోబడతారు. అదే పీఏసీఎస్‌లో 11 మంది డైరెక్టర్లు ఒక చైర్మన్ మరో వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలకమండళ్ల గడువు ముగియనుండడంతో కొత్తగా మళ్లీ ఆయా సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అనర్హులను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. సభ్యుల్లో అనేక మంది ఏళ్ల క్రితమే సభ్యత్వం పొందారు. ఆ తర్వాత వీరిలో కొంతమంది భూములను అమ్ముకున్నారు. మరికొంత మంది వృద్ధాప్యం, ఇతర కారణాలతో చనిపోయారు. ఇంకొంత మంది తమ భూములను పిల్లల పేరున మార్చారు. బ్యాంకుల్లో రుణాలు, పేరుపై భూమి లేకపోయినా వీరంతా ఇప్పటికీ సభ్యులుగా కొనసాగుతున్నారు. అంతేకాదు మండల సరిహద్దు గ్రామాల్లోని కొంత మంది రైతులకు రెండు మూడు రెవెన్యూ గ్రామాల పరిధిలో భూములు ఉంటున్నాయి. వీరు ఆయా కేంద్రాల్లో రుణాలు తీసుకోవడంతో పాటు సొసైటీల్లో సభ్యత్వాన్ని కలిగి ఉంటున్నారు. ఒకే వ్యక్తి రెండు, మూడు సొసైటీల్లో ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. సొసైటీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటములను శాసించే స్థాయికి చేరుకోవడంతో డైరెక్టర్లుగా ఎన్నికై.. రుణాల మంజూరీలో పలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఇలాంటి లొసుగులన్నింటికీ ఈకేవైసీ ద్వారా చెక్ పెట్టొచ్చనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుకు కసరత్తు

ప్రస్తుతం జిల్లాలో 37 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉండగా, వీటిలో మొత్తం 1,66,105 మంది సభ్యులు ఉన్నారు. కందుకూరులో అత్యధికంగా 12,997 మంది సభ్యులు ఉండగా, చౌటసింగారంలో 11,508 మంది ఉన్నారు. షాబాద్‌లో 10,943 మంది, తలకొండపల్లిలో 10,331 మంది సభ్యులు ఉన్నారు. మిగతా పీఏసీఎస్‌లలో ఐదు నుంచి ఏడు వేల మంది వరకు ఉన్నారు. వీరిలో కొంతమంది చనిపోగా, మరికొంత మంది భూములు అమ్ముకున్నారు. ఇంకొంత మంది భూములను ప్రభుత్వం సేకరించి, పాసు బుక్‌లను రద్దు చేసింది. వీరంతా ఇప్పటికీ సభ్యులుగా కొనసాగుతుండటం సాంకేతికంగా పలు సమస్యలకు కారణమవుతోంది. నిజానికి సహకార చట్టం ప్రకారం భూమి లేని వాళ్లు సొసైటీల్లో సభ్యులుగా అనర్హులు. ఏళ్లుగా బోగస్ సభ్యులను ఏరివేయక పోవడంతో ప్రస్తుతం వారి సంఖ్య రెట్టింపైంది. ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్‌ల విభజన ద్వారా జిల్లాలో కొత్తగా మరో 15 నుంచి 15 సంఘాల వరకు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. బ్యాంకులపై ఒత్తిడి కూడా తగ్గనుంది. మారుమూల ప్రాంతాల్లోని రైతులకు సేవలు అందుబాటులోకి రానున్నాయి.


కుర్మిద్దలో ఇటీవల ర్యాలీ చేపట్టిన రైతులు

ఆందోళనలపై పోలీసు నిఘా

- ఫ్యూచర్ సిటీపై సర్కార్ నజర్
- సీఎంఓ నుంచి కచ్చితమైన ఆదేశాలు
- రైతుల కదలికలపై పోలీసు శాఖ దృష్టి
- ఆటంకాలు లేకుండా నిర్మాణం జరిగేలా చర్యలు

యాచారం: ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి రేవంత్ రెడ్డి సర్కార్ వడివడిగా అడుగులు వేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎలాంటి సమస్య, అల్లర్లు ఉండరాదని, అలా జరిగితే పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపకపోవచ్చని భావిస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్‌సిటీకి ఎవరైనా భంగం కలిగించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవాలని నేరుగా సీఎంఓ నుంచి పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశాలు అందినట్లు సమాచారం. పట్టా భూముల పరిహారం అథారిటీలో జమ చేసిన రైతులకు మరింత పెంచి ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. ఇటీవలే కుర్మిద్ద గ్రామంలో పట్టా భూములకు ఎకరాకు రూ. 25 లక్షలకు పైగా పరిహారాన్ని అందించడం విశేషం.

రికార్డుల్లో టీజీఐఐసీని తొలగించాలని..

గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో ఫార్మాసిటీకి పట్టా భూములు ఇవ్వని రైతుల భూములపై రాత్రికిరాత్రే అవార్డులు పాస్ చేశారు. భూ రికార్డుల్లో రైతుల పేర్లను తొలగించి టీజీఐఐసీ పేరు నమోదు చేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే టీజీఐఐసీ పేరు తీసేసి రైతుల పేర్లు మార్చుతామని హామీ ఇచింది. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రైతులకు న్యాయం జరగడం లేదు. ఈ క్రమంలో దాదాపు 2,211 ఎకరాల పట్టా భూములకు సంబంధించి రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేయించాలని వారు మళ్లీ ఆందోళనబాట పట్టారు. గ్రామాల్లో ర్యాలీలు తీస్తూ మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు సీఎంఓ అధికారుల ఆదేశాల మేరకు గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు నిఘా పెట్టారు. అనుమతి లేకుండా ర్యాలీలు తీస్తే కేసులు నమోదు చేసేందుకు సిద్ధమయ్యారు.

భూముల స్వాధీనానికి సిద్ధం

పరిహారం పొందిన భూముల్లో రైతులు మూడేళ్లుగా ఆయా పంటలను పండిస్తూ ఆదాయం పొందుతున్నారు. మళ్లీ బోరుబావులు తవ్వించి వ్యవసాయం చేసుకుంటున్నారు. సాగు చేసిన పంటలు మరో నెల, రెండు నెలల్లో చేతికి రానున్నాయి. ఆ వెంటనే భూములను స్వాధీనం చేసుకుని మళ్లీ సాగు చేయకుండా చూడాలని అధికారులు నిర్ణయించారు.

మాట నిలబెట్టుకోవాలి



అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. టీజీఐఐసీ పేర్ల మీద మార్చేసిన భూ రికార్డులను రైతుల పేర్ల మీద మార్చాలి. అప్పట్లో పట్టా భూములు తీసుకోమని హామీ ఇచ్చారు. ఇప్పుడు అడిగితే అరెస్టులు చేస్తామని అంటున్నారు.

– ముత్యాల రాంచంద్రారెడ్డి, రైతు, నానక్‌నగర్

హద్దు మీరితే చర్యలు



అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లతో ర్యాలీలు, ఆందోళనలు, ధర్నాలు చేస్తే సహించేది లేదు. చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకోవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే మాత్రం కేసులు నమోదు చేయాల్సి వస్తుంది.

– కృష్ణంరాజు, సీఐ హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్

ఫ్యూచర్ సిటీతో అభివృద్ధి



ఫార్మాసిటీనే రద్దు చేశాక రైతులు మళ్లీ గ్రామాల్లో ర్యాలీలు తీయడం సరైంది కాదు. సీఎంఓ నుంచి కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. రైతులు చట్టపరిధి దాటి వ్యవహరించొద్దు. పరిహారం పెంపు, ఇతర ప్రయోజనాల కోసం దరఖాస్తులు ఇవ్వండి. ఫ్యూచర్‌సిటీతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

న్యూస్‌రీల్

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా సురేశ్


సురేశ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన గందె సురేశ్ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని చంపాపేటలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై గందె సురేష్‌కు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు విశ్వం, చెంది తిరుపతిరెడ్డి, జగదీశ్వర్, కల్వ యాదగిరి, ఉప్పల శ్రీనివాస్, యంసాని శ్రీనివాస్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతమే లక్ష్యం

తుర్కయంజాల్: జిల్లాలో బీఎస్పీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లాటి రాములు అన్నారు. పురపాలక సంఘం పరిధి మన్నెగూడలో ఆదివారం మున్సిపాలిటీ అధ్యక్షుడు పట్నం రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనకళ్యాణ్ దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయని విమర్శించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి బీఎస్పీ గురించి వివరించడంతో పాటు పలువురికి సభ్యత్వాలు అందజేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు గుండె శ్రీనివాస్, కోశాధికారి బి.మహేందర్, నాయకులు మంద రాజు, మేతరి కుమార్, జంతుక సైదులు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు పండుగ సాయన్న సేవాపురస్కారం


పురస్కారం అందుకుంటున్న నాగిళ్ల జగన్

ఆమనగల్లు: పండుగ సాయన్న స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో పండుగ సాయన్న రాష్ట్రస్థాయి సేవా పురస్కారాన్ని ఆమనగల్లు పట్టణానికి చెందిన బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు నాగిళ్ల జగన్ అందుకున్నారు. ఏటా వివిధ సామాజిక సేవలు అందిస్తున్న కవులు, కళాకారులు, అభ్యుదయ వాదులకు పండుగ సాయన్న రాష్ట్రస్థాయి సేవా పురస్కారం అందిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురికి పురస్కారాలు అందించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటూ నిస్వార్థంగా సేవలందిస్తున్న ఆమనగల్లుకు చెందిన నాగిళ్ల జగన్‌కు ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు శివరామచంద్ర పురస్కారం అందించారు. తనకు రాష్ట్రస్థాయి సేవా పురస్కారం రావడంపై నాగిళ్ల జగన్ హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ముగిసిన ఇస్తేమా


ఇస్తేమా అనంతరం ఇళ్లకు బయలుదేరిన ముస్లింలు

శంకర్‌పల్లి: పట్టణ శివారులోని జంబోరి గ్రౌండ్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన ఇస్తేమా కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నం పూర్తయింది. కార్యక్రమానికి చివరి రోజు కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు, హైదరాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. నిర్వాహకులు దీనికి అనుగుణంగానే ఏర్పాట్లు చేయడంతో ఎక్కడా ఇబ్బందులు తలెత్తలేదు. కార్యక్రమం ముగిసిన అనంతరం అందరూ ఒకేసారి బయటకు రావడంతో శంకర్‌పల్లి నుంచి పటాన్‌చెరు వైపు వెళ్లే ప్రధాన రహదారిపై కాసేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు శ్రమించి ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు.

కురుమలు రాజకీయంగా ఎదగాలి

రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మీర్‌పేట: కురుమలు రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం పిలుపునిచ్చారు. మీర్‌పేటలో ఆదివారం జిల్లా కురుమ సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కురుమలు స్థానికంగా అన్ని వర్గాలను కలుపుకొని పోవడంతో పాటు ఐక్యంగా ఉండి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. సొసైటీలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. జిల్లాలో కురుమ సంఘం భవనం ఏర్పాటుకు స్థలం కోసం త్వరలోనే కలెక్టర్‌ను కలుస్తానని, వీలైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో కురుమలకు దక్కాల్సిన వాటా ప్రకారం టికెట్లు కేటాయించాలని సీఎంను కోరినట్లు చెప్పారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దాల దశరథ మాట్లాడుతూ.. ఐకమత్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు రానున్న ఎన్నికల్లో కురుమల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, హాస్టల్ చైర్మన్ కొలుకుల నర్సింహ, గొర్రెల కాపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కిష్టగోని సదానందం, నాయకులు సిద్దాల బాలప్ప, సిద్దాల శ్రీశైలం, మీర్‌పేట అధ్యక్షుడు దేవరింటి వెంకటేశ్, అచ్చిని యాదగిరి, సిద్దాల జగదీశ్, మేకల ప్రశాంత్, పద్మశ్రీ, రేణుక పాల్గొన్నారు.

నేడు షాబాద్‌కు మంత్రుల రాక

షాబాద్: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు, మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి సోమవారం మంత్రులు హాజరవుతున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ బ్రిడ్జ్ ప్రారంభోత్సవం, ఏట్ల ఎర్రవల్లి బ్రిడ్జి శంకుస్థాపన, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, తుమ్మల నాగేశ్వర్ రావు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా ‘హరిత పరివారం’ సంబరాలు


సంబరాల్లో సంస్థ సభ్యులు

కడ్తాల్: అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో ఆదివారం ‘హరిత పరివారం ఆత్మీయ కుటుంబ సమ్మేళనం’ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదిహేనేళ్లుగా సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలో జయప్రదంగా నిర్వహించిన కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. భవిష్యత్ కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొంటూ కుటుంబ సమేతంగా ఆనందోత్సాహాల మధ్య సంబరాలు చేసుకున్నారు. ముగ్గుల పోటీలు, బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేశారు. భోగి మంటలు వేసి ఉత్సవాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, ఆచార్య పురుషోత్తంరెడ్డి, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, పర్యావరణవేత్త దొంతి నరసింహారెడ్డి, పర్యావరణ నిపుణులు శివప్రసాదరావు, తులసీరావు, ఇంద్రసేనరెడ్డి, వెంకట్‌రెడ్డి, అన్నమయ్య, రాజేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, ఉమామహేశ్వర్‌రెడ్డి, అనుదీప్, నగేశ్, కోటి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మెట్రో భూసేకరణలో మరో అడుగు

సాక్షి, సిటీబ్యూరో: పాత నగరంలో రెండో దశ మెట్రో పనుల్లో మరో అడుగు పడింది. రోడ్డు విస్తరణలో భాగంగా ఆస్తులు కోల్పోయిన యజమానులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించడానికి ముహూర్తం ఖరారైంది. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు చెక్కులు పంపిణీ చేయనున్నారు. రెండో దశ కారిడార్–6లో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు 7.5 కి.మీ మార్గంలో 1,100 ఆస్తులు ప్రభావితం కానున్నాయి. యజమానులు స్వచ్ఛందంగా తమ స్థలాలను మెట్రో రైలు నిర్మాణం కోసం ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 169 మంది అనుమతి పత్రాలను అందజేశారని చెప్పారు. వీరిలో 40కి పైగా ఆస్తుల యాజమాన్యానికి సంబంధించిన ధ్రువీకరణ పూర్తయిందన్నారు. తొలి దశలో ఈ 40కి పైగా ఆస్తుల యజమానులకు నష్ట పరిహారాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెక్కుల రూపంలో అందజేస్తారని తెలిపారు. ప్రభావిత ఆస్తులకు చదరపు గజానికి రూ.81,000 చొప్పున అందజేయనున్నారు. లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేయనున్నారు.

మానవత్వం చాటిన కానిస్టేబుల్ కుటుంబం

- రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి
- అవయవాలను దానం చేసిన కుటుంబం


ప్రశాంత్‌రెడ్డి (ఫైల్)

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి చెందగా వారి కుటుంబీకులు అవయవ దానం చేసి పలువురి ప్రాణాలను కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పెద్దోళ్ల ప్రశాంత్‌రెడ్డి నాలుగేళ్లుగా కందుకూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గతనెల 28న విధులు ముగించుకుని బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీంతో ప్రశాంత్‌రెడ్డి తండ్రి రిటైర్డ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాగిరెడ్డి, తల్లి సౌమ్య జీవన్‌దాన్‌కు కిడ్నీలు, కాలేయం ఇచ్చారు. తమ బిడ్డ ప్రాణం పోయిన బాధలోనూ అవయవదానానికి ముందుకు రావడంపై రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు వారిని అభినందించారు. శాఖాపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. అవయవదానం చేసిన వారు భౌతికంగా మరణించినప్పటికీ జీవించి ఉన్నట్లేనని, అవయవదానంతో మరొక మనిషికి ప్రాణం పోయడం గొప్ప విషయమన్నారు. ఉప్పల్‌లో ఆదివారం జరిగిన ప్రశాంత్‌రెడ్డి అంత్యక్రియల ఖర్చులకు రూ.90 వేలు మంజూరు చేశారు. సీపీ తరపున మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ సీతారాం, రాచకొండ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ భద్రారెడ్డి, కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సువర్ణ, సహచరులు అంత్యక్రియలకు హాజరయ్యారు.

కరాటే సాధనతో మానసికోల్లాసం


గెలుపొందిన విద్యార్థులతో నటుడు సుమన్

సినీనటుడు సుమన్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులలో యుద్ధవిద్యలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని సినీనటుడు సుమన్ అన్నారు. యాదవ్ బుడోకాన్ కరాటే క్లబ్ ఫౌండర్ మల్లేశ్‌యాదవ్ స్మారకార్థం ఆదివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ గార్డెన్‌లో 38వ ఆల్ ఇండియా లెవల్ ఓపెన్ కరాటే, కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా సినీనటుడు సుమన్ హాజరై మాట్లాడుతూ.. కరాటే, కుంగ్ ఫూ వంటివి విద్యార్థులకు ఎంతో అవసరమని అన్నారు. ఆపద సమయంలో రక్షించుకునేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. కరాటే, కుంగ్ ఫూ సాధనతో శారీరక దృఢత్వంతో పాటుగా మానసికోల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు మత్తుపదార్థాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కరాటే పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మహేందర్‌రెడ్డి, అశోక్‌యాదవ్, కరాటే మాస్టర్లు సాయినాథ్‌యాదవ్, ఉత్తేజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్


దీక్షలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

తుర్కయంజాల్: మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి వేతనాలను పెంచకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్ హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తుర్కయంజాల్‌లో మున్సిపల్ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్ డ్ పే తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, 2వ పీఆర్సీ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, దాసు, మహేష్, వెంకటేష్, భాగ్యమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి


నూతన కార్యవర్గసభ్యులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

యువజన సంఘం అధ్యక్షుడు రాహుల్‌గుప్తా

షాబాద్: ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య మహాసభ జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు దండు రాహుల్ గుప్తా అన్నారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా యువజన సంఘం నూతన కార్యవర్గ సభ్యులను ఆదివారం నగరంలోని చంపాపేటలో ఓ గార్డెన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయించారు. జిల్లా అధ్యక్షుడిగా దండు రాహుల్‌గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నరాల పూర్ణచందర్‌గుప్తా, చొక్కం పేట్ రాకేశ్‌గుప్తా, యాచం నవీన్‌గుప్తా, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, లక్ష్మీనర్సింహులు, గద్దం రమేష్‌గుప్తా తదితరులను ఎనుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఆర్యవైశ్య సంఘం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతనంగా రాహుల్‌గుప్తా మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు సాయిరాం గుప్తా, కృష్ణగుప్తా, బస్వరాజ్‌గుప్తా, కిషోర్‌గుప్తా, మదన్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, వెంకటేశ్‌గుప్తా, రాఘవేందర్‌గుప్తా, రామ్మోహన్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


తనూజ్ (ఫైల్)

శంకర్‌పల్లి: ఎదురెదురుగా వెళ్తున్న లారీ, బైక్ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శంకర్‌పల్లి పట్టణ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారానికి(ఓడీఎఫ్)కి చెందిన కోటేశ్వరావు విశ్రాంత ఉద్యోగికి కొడుకు తనూజ్(26) ఉన్నాడు. అతడు శనివారం రాత్రి తన స్నేహితులను కలిసేందుకు శంకర్‌పల్లికి బైక్‌పై బయలుదేరి వెళ్లాడు. పట్టణ శివారులోకి ఎల్లో కప్ కేఫ్ దగ్గర వచ్చిన సమయంలో అతివేగం, అజాగ్రత్తగా ఎదురుగా వస్తున్న లారీ తనూజ్‌ని బలంగా ఢీ కొట్టింది. తీవ్ర గాయాలవ్వడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: మద్యం మత్తులో కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సత్యకుమార్ సమాచారం మేరకు... రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రాంతానికి చెందిన పాముల రఘు(50) రాజేంద్రనగర్ వెటర్నరీ కాలేజీలో సెక్యూరిటీ గార్డుగా పని నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి కాటేదాన్ కల్లు కంపౌండ్‌లో కల్లు సేవించి కంపౌండ్ వాల్‌లో పక్కన కింద పడి మృతి చెంది ఉన్నాడు. ఉదయం పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలికి చేరుకున్న ఎస్ఐ సత్యకుమార్ ఆ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కుల్కచర్ల: ఎదురెదురుగా వస్తున్న ఆటో–బైక్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బండవెల్కిచర్ల గ్రామం నుంచి కుల్కచర్ల వైపు వస్తున్న ఓ బైక్ ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పరిగి మండలం మల్లేమోనిగూడ గ్రామానికి చెందిన గోపాల్, మల్లేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పొగమంచు గమనించు!

- ముందు వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు
- చలికి తలెత్తుతున్న శ్వాసకోశ సమస్యలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు


షాబాద్‌లో కమ్ముకున్న పొగమంచు

షాబాద్: పొగమంచు జిల్లాపై పంజా విసురుతోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఓ వైపు శీతల వాతావరణం, మరోవైపు పొగమంచు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చల్లటి గాలులకు శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు.

ఆరోగ్య నియమాలు

- వెచ్చని దుస్తులు ధరించడంతో పాటు వేడి పానియాలు తీసుకోవాలి.
- శారీరక శ్రమ శరీరాన్ని బలోపేతం చేస్తుంది.
- రోజుకు 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- సమతుల్యమైన ఆహారం కోసం పండ్లు, కూరగాయలు, పప్పు దినుసులు తీసుకోవాలి.
- వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

ఇవి తప్పనిసరి పాటించాలి

- పొగమంచులో ప్రయాణం చేసేటప్పుడు వాహనాన్ని తక్కువ వేగంతో నడపాలి.
- తక్కువ బీమ్‌లో హెడ్‌లైట్లను సెట్ చేసుకోవాలి.
- దట్టమైన పొగమంచు ప్రాంతాల్లో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు వార్నింగ్ లైట్‌ను ఆన్ చేసుకొని ప్రయాణించడం బెటర్.
- జాతీయ రహదారులపై ప్రయాణిస్తున్నప్పుడు లేన్‌ను మార్చకూడదు.
- వాహనాలు కనిపించకపోతే ఇండికేటర్ ఉపయోగించాలి.
- వాహనం అద్దాలను లోపల, బయట క్లీన్‌గా ఉంచుకోవాలి.
- వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించవద్దు.

పలు ఘటనలు

పొగమంచు కారణంగా ఇటీవల మండల పరిధిలోని నాగర్‌గూడ, చందనవెల్లి గ్రామాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ముందు వాహనాలు కనబడక పోతుగల్, షాబాద్, సర్దార్‌నగర్ తదితర ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో పాఠశాల బస్సు ఢీకొని ఇరువురు గాయపడ్డారు.

జాగ్రత్తలు ముఖ్యం



చలి విజృంభిస్తున్న సమయాల్లో చిన్నపిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్త తీసుకోవాలి. దగ్గు, జలుబు లాంటివి ఉంటే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. అక్కడ అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. కొవిడ్ భయాలు ఏ మాత్రం వద్దు. – డాక్టర్ విజయలక్ష్మి, పీహెచ్‌సీ, షాబాద్

వేగం తగ్గించాలి



పొగమంచు కురిసే సమయాల్లో వేగాన్ని తగ్గించి వాహనాలు నడపాలి. హెడ్ లైట్లు, ఎల్లో ఇండికేటర్స్ వేసుకోవాలి. వాహ నాలకు రేడియం స్టిక్కర్లు తప్పకుండా ఉండాలి. డ్రైవర్లు వాహనాల మధ్య దూరం పాటించాలి. ముందు ఆగి ఉన్న వాహనాలను గుర్తిస్తూ నడపాలి. – కాంతారెడ్డి, సీఐ షాబాద్

వ్యసనాలకు దూరంగా ఉండాలి


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఏసీపీ తదితరులు

ఏసీపీ రాజు

మంచాల: చెడు మార్గాలకు దూరంగా యువత దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బండలేమూర్‌లో నిర్వహించిన బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ తోపాటు 5 కే రన్, 2 కేరన్ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి యువశక్తి ఎంతో విలువైందన్నారు. యువత వ్యసనాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండే విధంగా యువత కృషి చేయాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు. బండలేమూర్ గ్రామంలో యువతను మేల్కొపే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఐ మధు, నాయకులు రాంరెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, శివకుమార్, ప్రదీప్, కృష్ణ, విక్రమ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిని కబళించిన కంటైనర్

- మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద రోడ్డు ప్రమాదం
- దంపతులు సహా కుమార్తె దుర్మరణం
- కుమారుడి పరిస్థితి విషమం


లావణ్య, బుల్లబ్బాయ్


హర్షితాదేవి (ఫైల్)

మేడ్చల్‌రూరల్: ప్రమాదానికి గురై ఆపదలో ఉన్న వారిని పరామర్శించేందుకు వెళ్తున్న ఓ కుటుంబంలోని ముగ్గుర్ని కంటైనర్ వాహనం కబళించింది. ఈ విషాదకర ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ కాకినాడలోని ఎర్రవరంనకు చెందిన సాగి బుల్లబ్బాయ్ (35), భార్య లావణ్య (25), కూతురు హర్షితాదేవి (8), కుమారుడు సిద్దేశ్వర్ (6)లతో కలిసి బతుకుదెరువు కోసం కొన్నాళ్ల క్రితం నగరానికి వలస వచ్చి ఉప్పల్ ప్రాంతంలో ఉంటున్నారు. బుల్లబ్బాయ్ ఉదయం పూట ఇడ్లీ (టిఫిన్స్) అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కాకినాడ ప్రాంతానికే చెందిన బుల్లబ్బాయ్ స్నేహితుడైన జోక వెంకటేశ్వర్‌రావు కుటుంబం మేడ్చల్ మండలం ఎల్లంపేట్ గ్రామంలో నివాసం ఉంటూ టిఫిన్స్ వ్యాపారం చేస్తోంది. కొన్ని రోజుల క్రితం వెంకటేశ్వర్‌రావు భార్య ప్రమాదానికి గురై చేతికి ఫ్రాక్చర్ అయింది. వీరిని పరామర్శించేందుకు ఆదివారం బుల్లబ్బాయ్ కుటుంబం (నలుగురు) తమ టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంపై ఉప్పల్ నుంచి ఎల్లంపేట్‌కు వెళ్తోంది. మేడ్చల్ చెక్‌పోస్ట్ సమీపానికి చేరుకున్న వీరి ద్విచక్ర వాహనాన్ని వెనక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ వాహనం ఢీకొట్టింది. దీంతో టీవీఎస్‌పై ఉన్న బుల్లబ్బాయ్, ఆయన భార్య లావణ్య, కూతురు హర్షితా దేవి, కుమారుడు సిద్దేశ్వర్ రోడ్డుపై పడిపోయారు. వీరిపై నుంచి కంటైనర్ వెళ్లడంతో దంపతులతో పాటు కుమార్తె అక్కడికక్కడే మృతి చెందారు. సిద్దేశ్వర్ రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మేడ్చల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడి హేయం

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామెల్


సమావేశంలో మాట్లాడుతున్న సామెల్

మహేశ్వరం: ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు బోడ సామెల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్కు ప్రకాశ్ కారత్ అధ్యక్షతన మహేశ్వరంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామెల్ మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధానికి 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భక్తి ముసుగులో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రధానోపాధ్యాయుడిని అసభ్య పదజాలంతో దూషించి దాడి చేయడంతో పాటు 8వ తరగతి విద్యార్థి కాళ్లు మొక్కించడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుడిపై దాడి జరిగి రెండు వారాలు గడుస్తున్నా ఇంతవరకు జిల్లా కలెక్టర్, విద్యాశాఖ, పోలీసు అధికారులు, శాసనసభ్యులు, ఎంపీ స్పందించకపోవడం దారుణమన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐద్వా నాయకురాలు సుమలత, విజయమ్మ, ఉమా, సీఐటీయూ నాయకులు రవికుమార్, బాలరాజ్, శేఖర్, కాంగ్రెస్ నాయకులు బాకీ జాన్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు తరంగ్, నాయకులు ఆనంద్, తిరుపతయ్య, బాలరాజ్, ప్రసాద్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో రహదారి విస్త‘రణం’!

రోడ్డు 80 ఫీట్ల మేర విస్తరణపై వ్యతిరేకత

- వద్దే వద్దంటున్న స్థానికులు.. ప్రజాప్రతినిధులు
- ధర్మగిరి రోడ్డు నుంచి రైల్వేకమాన్ వరకు విస్తరణ
- 208 ఆస్తులకు నోటీసులు.. త్వరలో మరికొందరికి...
- నలభై ఫీట్లకే పరిమితం చేయాలని డిమాండ్
- మున్సిపల్ సమావేశంలోనూ తీర్మానం


80 ఫీట్ల మేర విస్తరించనున్న రహదారి ఇదే...

శంషాబాద్: ఆ రోడ్డు విస్తరణ వివాదాస్పదంగా మారుతోంది. స్థానికులు వద్దంటున్నారు.. ప్రజా ప్రతినిధులు మద్దతిస్తున్నారు. ఏకంగా పురపాలక సంఘం సర్వసభ్య సమావేశంలో తీర్మానం కూడా చేశారు. అయినా అధికార యంత్రాంగం మాత్రం రహదారి విస్తరణకు నోటీసులు జారీ చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

- శంషాబాద్ పట్టణంలోని ధర్మగిరి రోడు నుంచి రైల్వేగేటు వరకు రహదారిని ఎనభై ఫీట్ల మేర విస్తరించేందుకు అధికారులు నిర్ణయించారు. ఇందుకు భవనాల యజమానులకు నోటీసులు జారీ అవుతున్నాయి.
- ప్రధానంగా పట్టణంలోని 18, 19, 20వ వార్డులలో మొత్తం పెద్ద మొత్తంలో ఆస్తులు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో స్థానికులతో పాటు ప్రజాప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించారు. 80 ఫీట్ల రహదారి తమకు వద్దుంటూ గట్టిగా నినదిస్తున్నారు.

భారీగా ఆస్తులు కోల్పోయే ప్రమాదం

రహదారిని అధికారులు ప్రతిపాదించిన మేర 80 అడుగుల మేర విస్తరిస్తే ఆ ప్రాంతంలోని ప్రజలు భారీగా ఆస్తులను కోల్పోవాల్సి వస్తుంది.

- 18, 19, 20వ వార్డులలో వడ్డెరబస్తీ, కాపుగడ్డ యాదవ బస్తీ, రుద్రా కాలనీ, రైల్వే గేటు వరకు మొత్తం 208 మందికి సంబంధించిన ఆస్తులు రహదారి విస్తరణలో కోల్పోవాల్సి ఉంటుందని అధికారులు గుర్తించారు. ఈ మేరకు సంబంధిత వ్యక్తులకు వారం రోజులుగా నోటీసుల జారీ చేస్తున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.
- ఎనభై ఫీట్ల మేరకు రహదారి విస్తరిస్తే కొన్ని కొందరు బాధితులు పూర్తి స్థాయిలో తమ ఇళ్లను కోల్పోతుండటంతో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.
- స్థానిక ప్రజాప్రతినిధులు ప్రస్తుతం ఇరవై ఫీట్ల వెడల్పున్న ఈ రహదారిని నలభై ఫీట్ల మేరకు విస్తరిస్తే సరిపోతుందని అధికారులకు విన్నవిస్తున్నారు. అంతేకాకుండా ఇన్స్‌బై ఇన్స్ దుకాణం పక్క నుంచి జాతీయ రహదారి అనుసంధానించే మరో ప్రణాళిక కూడా ప్రభుత్వం వద్ద ఉన్నా బస్తీల మీదుగా వెళ్లే రహదారిని విస్తరించాల్సిన అవసరం ఏముందని కూడా ప్రశ్నిస్తున్నారు. ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలు లేదా విస్తరణను తగ్గించాలని వాదిస్తున్నారు.

కౌన్సిల్‌లోనూ తీర్మానం...

ఇటీవల జరిగిన శంషాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కూడా రహదారి విస్తరణ నలభై ఫీట్ల మేరకే చేపట్టాలని కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్, చైర్ పర్సన్‌లకు వినతి పత్రాలను సమర్పించారు. ఈ మేరకు కౌన్సిల్‌లో కూడా తీర్మానం చేశారు. అవసరమైతే న్యాయ పోరాటం చేసేందుకూ సిద్ధంగా ఉన్నామంటూ స్థానికులు స్పష్టం చేస్తున్నారు.